వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 228 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఫిబ్రవరి 2025 | వెల : రూ 10/-

# కేబినేట్ విస్తరణ పై చర్చించలే

## రాహుల్‌తో సీఎం రేవంత్ భేటీ

- దేశానికి రోడ్‌మ్యాప్ కానున్న కులగణన
- ఫిరాయింపులపై కోర్టు ఆదేశాల మేరకు నడుచుకుంటాం
- ప్రధాని మోదీని వ్యక్తిగతంగా తాను తిట్టలేదు
- ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి చిట్ చాట్





న్యూఢిల్లీ,
తెలంగాణలో కులగణన దేశానికి రోడ్ మ్యాప్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సుమారు గంటసేపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశమైన రేవంత్‌రెడ్డి .. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. భేటీ అనంతరం -మిగతా 3 లో



## జీరో గ్రావిటీ నుంచి గ్రావిటీకి సునీత విలియమ్స్

- భూమ్మిదకు వచ్చిన తరవాత ఆనేక ఆరోగ్య సమస్యలు
- వెల్లడించిన మరో ఆస్ట్రోనాట్ బుచ్ విల్మోర్

న్యూయర్క్,
అనుకోని పరిస్థితుల్లో అంతరిక్ష కేంద్రంలో ఉండిపోవాల్సి వచ్చిన ఇద్దరు నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ భూమ్మిదకు చేరుకున్నాక ప్రత్యేక పరిస్థితుల్లో ఉండాల్సి -మిగతా 3 లో




## నెట్‌జీరో సీటీగా ఫ్యూచర్ సీటీ నిర్మాణం

- డీప్యూటి సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్,
ఫ్యూచర్ సిటీని నెట్‌జీరో సిటీగా నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఐజీబీసీ ఆధ్వర్యంలో నోవాటెల్‌లో నిర్వహిస్తున్న గ్రీన్ తెలంగాణ సమ్మిట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 'ప్రపంచానికే ఆదర్శంగా ఉండేలా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తాం. ప్రభుత్వ అంకితభావం చాటిచెప్పడానికే ఐజీబీసీతో -మిగతా 3 లో

## పది పరీక్షల నిర్వహానకు పటిష్ట భద్రత

- పరీక్షా సెంటర్ల వద్ద 8వేలకు పైగా సీసీ కెమెరాలు
- 40 మంది సిబ్బందితో కమాండ్ సెంటర్



హైదరాబాద్,
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో వచ్చే నెల 5వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. అయితే ఈ పరీక్షల్లో పారదర్శకత కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాట్లు చేస్తున్న పరీక్ష కేంద్రాల్లో 8 వేలకిపైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళికి వివరించారు.
-మిగతా 3 లో

## తుదిదశకు చేరుకున్న మహాకుంభమేళా

- రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రాక
- కుంభమేళాను మరి కొన్నిరోజులు పొడిగించాలన్న అఖిలేశ్



ప్రయాగ్‌రాజ్,
మహాకుంభమేళా తుదిదశకు చేరుకుంటోంది. రోజురోజుకూ భక్తులు భారీగా తరలివచ్చి పుణ్యస్నానాలు చేస్తున్నారు. ఇప్పటికే 50 కోట్లమందికి పైగా గంగానదిలో పుణ్యస్నాన మాచరించినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. మరో పదిరోజుల్లో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ముగియనుండగా.. భక్తుల తాకిడి మాత్రం తగ్గడం లేదు. ప్రయాగ్ రాజ్ వస్తున్న వారితో రోడ్లు కిక్కిరిసి
-మిగతా 3 లో

## మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పులకుప్పలుగా మార్చారు

- రహదారుల అభివృద్ధి కేంద్రం వేల కోట్లు
- విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



నల్లగొండ,
తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు రాష్ట్రం మిగులు బడ్జెట్‌గా ఉందని, ఆ తరువాత అప్పులకుప్పలుగా మార్చారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణకు కేంద్రం నిధులు కేటాయించడం లేదన్నది పూర్తిగా అవాస్తమన్నారు. -మిగతా 3 లో

## మోడీ కులం, రాహుల్ మతంపై చర్చకు సిద్ధం

- బీసీ జాబితా నుంచి ముస్లింలను తప్పిస్తే కేంద్రాన్ని ఒప్పిస్తా
- ఎనిమీ ఆస్తుల అమ్మకానికి సిద్ధం
- కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు



హైదరాబాద్,
బీసీ జాబితా నుంచి ముస్లింలను తప్పిస్తే కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పిస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని -మిగతా 3 లో




## మోడీ కులం పై రేవంత్ వ్యాఖ్యల్లో తప్పులేదు

- ఏడాది క్రితం అమిత్‌షాయే చెప్పారు
- దేశంలో కుల గణన చేస్తే ఆయన తన కులం ఏంటో చెప్పారు కదా?
- బీజేపీ నేతలకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ కౌంటర్

హైదరాబాద్
ప్రధాని మోడీ కులంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో తప్పులేదని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ పునరుద్ఘాటించారు. ఈ విషయాన్ని ఏడాది క్రితమే కేంద్ర హెూంమంత్రి అమిత్‌షాయే చెప్పారని గుర్తు చేశారు. దేశంలో కులగణన చేస్తే ఆయన తన కులం ఏంటో చెబుతారని స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ కులం,
-మిగతా 3 లో

## ఏ లెక్కన 42శాతం రిజర్వేషన్లు ఇస్తారు

- జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలి
- బీసీ జనాభాపై తప్పుడు లెక్కలు సరికాదు
- గ్రామాల వారీగా సర్వే నివేదిక బయటపెట్టాలి
- జాగృతి రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత డిమాండ్





ఖమ్మం,
రాష్ట్రంలో దౌర్భాగ్యమైన పరిస్థితి నెలకొందని... మాజీ సీఎం కేసీఆర్‌పై కక్షతో రైతులను బాధపెడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. శనివారం మీడియాతో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. గోదావరి జలాలు కళ్ళముందే పోతున్నా పట్టించుకునే దిక్కులేదన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్ 190 టీఎంసీ కోసం చంద్రబాబు కొట్లాడుతున్నారని..బంకచర్లకు కేంద్రం అనుమతి ఇస్తే మన పరిస్థితి ఏంటని ఆమె ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డికి కనీసం ఈ ఏడాది కాలంలో తట్టెడు మట్టి పోయలేదన్నారు. రాజకీయాల -మిగతా 3 లో

## 17 నుంచి ఫాస్ట్ ట్యాగ్ కొత్త రూల్స్




**హైదరాబాద్:**
దేశంలోని వాహన వినియోగదారులకు కొత్త ఫాస్ట్ ట్యాగ్ నియమ నిబంధనలు అమల్లోకి రాబోతున్నాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 2025 జనవరి 28న కొత్త నియమాలను జారీ చేసింది. ఈ నిబంధనల ప్రకారం ఫిబ్రవరి 17, 2025 నుంచి మీరు టోల్ ప్లాజాకు చేరుకున్న తర్వాత 60 నిమిషాల కంటే ఎక్కువ సమయం తీసుకుంటే, ఫాస్ట్ ట్యాగ్ బ్లాక్ అవుతుంది. ఆ సమయంలో చెల్లింపులు జరగవు. అదేవిధంగా ట్యాగ్‌ను టోల్ ప్లాజా వద్ద చూపించిన తర్వాత కనీసం 10 నిమిషాలకు బ్లాక్‌లిస్ట్ చేయబడితే కూడా చెల్లింపులు జరగవు. ఈ కొత్త నియమాల ప్రకారం వినియోగదారులకు 70 నిమిషాల సమయం లభిస్తుంది. దీని ద్వారా వారు తమ ఫాస్ట్ ట్యాగ్ స్థితిని అప్‌డేట్ చేసుకోవచ్చు. టోల్ ప్లాజాకు చేరుకుని, చివరి క్షణంలో ఫాస్ట్ ట్యాగ్ రీఛార్జ్ చేస్తే, అది మీకు ప్రయోజనం చేకూర్చదు. మీ ట్యాగ్ ముందే బ్లాక్‌లిస్ట్ చేయబడితే, టోల్ ప్లాజా వద్ద రీఛార్జ్ చేసినా, చెల్లింపులు జరగవు. దీని కారణంగా మీరు రెట్టింపు టోల్ ఛార్జీలు చెల్లించాల్సి వస్తుంది. ఇది వినియోగదారులకు అదనపు భారంగా పరిణమించనుంది. అలాగే ఫాస్ట్ ట్యాగ్ బ్లాక్ లిస్ట్‌లో ఉన్నప్పుడు మీరు టోల్ ప్లాజాను దాటితే రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తారు.

## తెలంగాణలో ఎమ్మెల్సీ కోడ్

### రేషన్ కార్డుల జారీలో కొంత ఆలస్యం




**హైదరాబాద్**
తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు పక్రియ కొనసాగుతోంది. నూతనంగా దరఖాస్తు చేసే చాన్స్ కూడా కల్పిస్తోంది. దీంతో మీ-సేవా కేంద్రాల దగ్గర భారీగా జనం బారులు తీరుతున్నారు. గత రెండ్రోజుల నుంచి మీ-సేవా సెంటర్ల దగ్గర భారీగా రద్దీ నెలకొంటోంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా కార్డు రాకపోవడంతో వాళ్లలో చాలా మంది మీ-సేవలో తిరిగి దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే ఈ ప్రక్రియ కొంత ఆలస్యం కానుందని సమాచారం. ప్రస్తుతం తెలంగాణలోని పలు జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ స్థానానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది. అటు మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంగనర్‌లో టీచర్ ఎమ్మెల్సీకి నగారా మోగింది. ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ జరగనుంది. ఎన్నికల కారణంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చింది. దీంతో ఇది ముగిసేవరకు రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ పక్రియ నిలిచిపోనుంది. గ్యాడ్యుయేట్, ఎమ్మెల్సీ ఎలక్షన్ ముగిశాకే నూతన రేషన్ కార్డుల జారీ పక్రియ మొదలవనుందని తెలుస్తోంది. అయితే కార్డుల కోసం దరఖాస్తు పక్రియ మాత్రం కొనసాగుతుందని.. ఇది నిరంతర పక్రియ అని, మీ-సేవా కేంద్రాల్లో అప్లయ్ చేసుకోవాలని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిశీలించి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని అంటున్నారు.

## తమన్‌కు బాలయ్య కారు గిఫ్ట్



**హైదరాబాద్,**
సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్‌కు టాలీవుడ్ సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ ఖరీదైన పోర్షే కారును గిఫ్ట్‌గా ఇచ్చారు. బాలయ్య-తమన్‌ల కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలు హిట్ అయిన సంగతి విదితమే. తాజాగా విడుదలైన 'డాకు మహారాజ్' కూడా హిట్టందుకుంది. అలాగే సినిమాతో పాటు వ్యక్తిగతంగా కూడా బాలకృష్ణ, తమన్ ల మధ్య మంచి రిలేషన్ ఉంది. ఇక తాజాగా తమన్ కు బాలయ్య ఓ సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చారు. ఖరీదైన పోర్షే కారును బహుమతిగా ఇచ్చారు. కెరీర్ పరంగా మరెన్నో విజయాలు అందుకోవాలని యువ సంగీత దర్శకుడిని ఆశీర్వదించారు. తమన్ కు బాలకృష్ణ కారు బహుమతిగా ఇస్తున్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ విషయాన్ని తెలియజేస్తూ హైదరాబాద్ లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో ఆంకాలజీ యూనిట్ ప్రారంభోత్సవంలో తమన్ గురించి బాలయ్య ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'తమన్ నాకు తమ్ముడితో సమానం. వరుసగా నాలుగు హిట్లు ఇచ్చిన తమ్ముడికి ప్రేమతో కారు గిఫ్ట్ గా ఇచ్చాను. భవిష్యత్తులోనూ మా ప్రయాణం ఇలాగే కొనసాగుతుంది' అని అన్నారు.

# ఎలాన్ మస్క్ బిడ్డకు జన్మనిచ్చా

### -రచయిత్రి ఆష్లీ సెయింట్ క్లెయిర్ సంచలన వ్యాఖ్యలు



**న్యూయర్క్,**
ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు సంబంధించి రచయిత్రి ఆష్లీ సెయింట్ క్లెయిర్ సంచలన విషయం వెల్లడించారు. తన బిడ్డకు తండ్రి మస్క్ అంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు. 'ఐదు నెలల క్రితం నేనో బిడ్డకు జన్మనిచ్చాను. నా చిన్నారికి ఎలాన్ మస్క్ తండ్రి. మా బిడ్డ గోప్యత, భద్రతను దృష్టిలోఉంచుకొని ఇంతకుముందు నేను ఈ విషయాన్ని బహిర్గతం చేయలేదు. కానీ కొన్ని మీడియా సంస్థలు మాత్రం ఆ విషయాన్ని బయటపెట్టాలని ప్రయత్నించాయి. అందుకే నేనే వాస్తవాలు వెల్లడిస్తున్నా. మా సంతానం సురక్షిత వాతావరణంలో జీవించాలని నేను కోరుకుంటున్నాను. మా గోప్యతకు ఎవరూ భంగం కలిగించొద్దని విజ్ఞప్తి చేస్తున్నాను' అని తన పోస్టులో కోరారు. అయితే దీనిపై ప్రస్తుతానికి మస్క్ నుంచి ఎలాంటి స్పందన లేదు. మస్క్‌కు 12 మంది సంతానం. మొదటి భార్య జస్టిన్‌కు జన్మించిన తొలిబిడ్డ అనారోగ్య కారణాలతో 10 వారాలకే మృతి చెందింది. తర్వాత ఆ జంట ఐవీఎఫ్ పద్ధతిలో ఐదుగురు పిల్లలకు జన్మనిచ్చింది. 2008లో వారిద్దరూ విడిపోయారు. తర్వాత బ్రిటన్ నటి తాలులాహ్ రిలేను ఈ టెస్లా సీఈఓ వివాహమాడారు. అయితే వారికి సంతానం లేదు. అనంతరం కెనడియన్ గాయని గ్రిమ్స్‌తో సంబంధం నెరిపారు. వారికి ముగ్గురు పిల్లలు. తన ప్రతిష్ఠాత్మక సంస్థ బ్రెయిన్ టెక్నాలజీ స్టార్టప్ న్యూరాలింక్‌లో పనిచేస్తోన్న ఎగ్జిక్యూటివ్‌తోనూ మరో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చినట్లు ఇటీవల మస్క్ వెల్లడించారు. ఇదిలాఉంటే.. మస్క్-జస్టిన్ దంపతులకు పుట్టిన జేవియర్ అలెగ్జాండర్ కొంతకాలం క్రితం అమ్మాయిగా మారారు. తన తండ్రితో కలిసి జీవించకపోవడంతో పాటు ఆకారం లేదా ఇతర ఏ రూపంలోనూ ఆయనతో సంబంధం లేకుండా ఉండాలని కోరుకుంటున్నట్లు జేవియర్ వెల్లడించారు. జేవియర్ పేరును జెన్నా విల్సన్‌గా పేరు మార్చుకున్నారు. దీనిపై ఓ సందర్భంలో మస్క్ స్పందించారు.'జెన్నాకు కమ్యూనిస్టు భావాలు ఎక్కువ. డబ్బులున్న వాళ్లందరూ చెడ్డవాళ్లని భావిస్తుంది. ఆమె అలా మారడానికి తను చదువుకున్న స్కూలే కారణం. తిరిగి ఆమెతో సత్సంబంధాలు ఏర్పరచుకోవడానికి చాలాసార్లు ప్రయత్నించి విఫలమయ్యాను. కానీ ఆమె నాతో కాస్త సమయం కూడా గడపడానికి ఇష్టపడటం లేదు. జెన్నాతో విభేదాలు రావడం చాలా బాధాకరం. నా మొదటి కుమార్తె మరణం కంటే జెన్నాతో విభేదాలే నన్ను ఎక్కువ బాధించాయి' అని వ్యాఖ్యానించారు. ఎలాన్ మస్క్ తండ్రి ఎర్రాల్ మస్క్. ఆయన ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. ఎలాన్ మస్క్ మంచి తండ్రి కాదన్నారు. 'ఎలాన్ తొలి సంతానం ఎక్కువ సమయం నానీల సంరక్షణలోనే ఉండేవాడు. కొన్ని వారాలకే ఆ బాబు చనిపోయాడు. నా కుమారుడు ప్రపంచ కుబేరుడు. తన ఒక్కో బిడ్డను ఒక్కో నానీ చూసుకుంటుంది. పిల్లల కోసం మస్క్ పెద్దగా సమయం కేటాయించడని వెల్లడించారు. ఈక్రమంలో రచయిత్రి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు బహిర్గతం కావడంతో సంచలనంగా మారింది..

# లవ్‌జిహాదీకి అడ్డుకట్టకు కఠిన చర్యలు

### -మతమార్పిడులను అడ్డుకునేందుకు చట్టం
### -ఏడుగురితో కమిటీ వేసిన మహా సర్కార్



**ముంబయి,**
'లవ్ జిహాద్'ను అడ్డుకునేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. దీనిని అడ్డుకునే క్రమంలో ఓ చట్టం తీసుకొచ్చే ఆలోచన చేస్తోంది. ప్రేమపేరుతో మత మార్పిడులకు పాల్పడుతున్న ఘటనలను అడ్డుకోవడానికి ఏడుగురు సభ్యులతో ఓ కమిటీని వేసింది. మహారాష్ట్ర డీజీపీ సంజయ్ వర్మ ఈ కమిటీకి నేతృత్వం వహించనున్నారు. బలవంతపు మత మార్పిడుల కు సంబంధించి వేర్వేరు రాష్ట్రాల్లో అమల్లో ఉన్న చట్టాలు, ఈ తరహా ఘటనలను అడ్డుకొనేందుకు న్యాయపరంగా ఉన్న అవకాశాలను ఈ కమిటీ ప్రభుత్వానికి తెలియజేయనుంది. మహారాష్ట్రకు చెందిన శ్రద్ధా వాకర్‌ను ఆమె ప్రియుడు అఫ్తాబ్ పూనావాలా 2022లో ముక్కలుగా చేసి అంతమొందించాడు. దీంతో అప్పట్లో లవ్ జిహాద్ అంశం తెరపైకి వచ్చింది. హిందూ అమ్మాయిల్ని ప్రేమ పేరుతో వివాహం చేసుకుని మత మార్పిడులకు పాల్పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తాయి. అప్పట్లో దీనిపై తీవ్రంగా చర్చ జరిగింది. ఈ అంశంపై తాజాగా అధికారంలోకి వచ్చిన భాజపా ప్రభుత్వం ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. అయితే, ఈ కమిటీ వేయడాన్ని విపక్షాలు తప్పుబట్టాయి. రాష్ట్రంలోని సమస్యలపై దృష్టి సారించాలని ఎన్సీపీ (శరద్ పవార్) నేత సుప్రియా సూలే ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టారు. ప్రేమ, పెళ్లి అనేవి వ్యక్తిగత వ్యవహారాలని పేర్కొన్నారు. ముస్లింలను వేధించడం, మతపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొట్టడంపైనే ప్రభుత్వం దృష్టి సారించిందంటూ సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే అబు ఆజ్మీ పేర్కొన్నారు. 'లవ్ జిహాద్' అనేది ఓ అపోహ మాత్రమేనని కాంగ్రెస్ ఎమ్మెల్యే హుస్సేన్ దల్వాయి అన్నారు. దేశంలో ఎవరు ఏ మతాన్నైనా స్వీకరించే స్వేచ్ఛ రాజ్యాంగం కల్పిస్తోందని గుర్తు చేశారు. అయితే, దేశంలోనూ, మహారాష్ట్రలోనూ ఇలాంటి లవ్ జిహాద్ కేసులు బోలెడని భాజపా ఎమ్మెల్యే మంగళ్ లోధా ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు.

## కూతురుతో చనువుగా ఉంటున్నందుకు కక్ష

### -యువకుడిని హత్య చేసిన బాలిక తండ్రి



**సంగారెడ్డి,**
బాలికతో దశరథ్(26) చనువుగా ఉంటున్నట్లు బాలిక తండ్రి గోపాల్ అతడిపై కక్ష పెంచుకున్నాడు. తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్న గోపాల్.. తన కూతురుతో సన్నిహితంగా ఉంటున్న దశరథ్‌ను అంతమొందించాలనుకున్నాడు. ఈ క్రమంలోనే దశరథ్‌ను హత్య చేసిన బాలిక తండ్రి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. నిజాంపేట మండల శివారు అటవీప్రాంతంలో యువకుడి మృతదేహాన్ని తగలబెట్టినట్టు సమాచారం. అనంతరం నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన గోపాల్ లొంగిపోయాడు. దశరథ్ కుటుంబ సభ్యులు మృతదేహం కోసం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. నిందితుడిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడు దశరథ్‌కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తన భర్త నాలుగు రోజులుగా కనిపించడం లేదంటూ మృతుడి భార్య పోలీసు

## ఆర్టీఐ పేరుతో బ్లాక్‌మెయిల్

### -ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు




**కర్నూలు,**
కర్నూలు జిల్లా ఆదోనిలో బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు పట్టణంలోని మధు ప్రైవేటు ఆసుపత్రి నిర్వాహకుడు గుర్రెడ్డిని బెదిరించారు. ఆదోని ఒకటో పట్టణ సీఐ శ్రీరామ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదోని మండలం బసాపురం గ్రామానికి చెందిన రఘునాథ్, ఆడివేష్.. ఆసుపత్రిలో వైద్యసేవలపై ఆర్టీఐ పిటిషన్లు వేస్తూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. రూ.50లక్షలు డిమాండ్ చేయడంతో ఆసుపత్రి యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. నోటీసులు ఇవ్వడానికి వెళ్లిన పోలీసులపై కూడా నిందితులు దాడికి యత్నించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీరామ్ తెలిపారు.

# కేబినేట్ విస్తరణ చర్చించలే

(మొదటి తరువాయి)

సీఎం మీడియాతో మాట్లాడారు. కులగణన ద్వారా ప్రజాసంక్షేమానికి బాటలు వేస్తున్నాం అని అన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణలో తెలంగాణ ఒక రోల్ మోడల్. రాహుల్ గాంధీ చెప్పింది నేను కచ్చితంగా చేస్తా. రాష్ట్రంలో కులగణన సమగ్రంగా నిర్వహించాం. ఇందులో వెల్లడైన వివరాల ఆధారంగా భవిష్యత్తులో కమిషన్ గాని కమిటీ గాని వేసి ప్రజలకు ఏ విధంగా సంక్షేమ ఫలాలు చేరువ చేయాలనే దానిపై కసరత్తు చేస్తాం అని వివరించారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటాం అన్నారు. ప్రధాని మోదీని వ్యక్తిగతంగా తాను తిట్టలేదు. మోదీ పుట్టుకతో బీసీ కాదని మాత్రమే చెప్పాను. పుట్టుకతో బీసీ కాదు కాబట్టే బీసీల పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదని అన్నాను. నా వ్యాఖ్యలను కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వక్రీకరించారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే జనగణనలో కులగణన కూడా చేయాలి. మంత్రివర్గ విస్తరణపై రాహుల్ గాంధీతో చర్చించలేదు. బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు తెస్తాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కావడంతో కేబినెట్ విస్తరణ కోసమేనని ఊహాగానాలు వినిపించాయి. మంత్రి పదవులు ఆశిస్తోన్న ఆశావహులు సైతం అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలోనే కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. తెలంగాణలో చేసిన కుల గణన గురించి రాహుల్ గాంధీకి వివరించానని మాత్రమే తెలిపారు. కేవలం కుల గణన, ఎస్సీ వర్గీకరణపై మాత్రమే రాహుల్ గాంధీతో చర్చించానని.. కేబినెట్ విస్తరణ, పీసీసీ కార్యకర్గ కూర్పుపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టత ఇచ్చారు. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ క్యార్గవర్గంపై చర్చించేందుకే ఈ భేటీ అన్న ఊహాగానాలు రేవంత్ రెడ్డి కొట్టి పారేశారు. కేబినెట్ విస్తరణ అంశం హై కమాండ్ చూసుకుంటుందని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపుల అంశంపైన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటామని స్పష్టం చేశారు. కోర్టులు చేసే పనిని కేటీఆర్ చేయాలనుకుంటున్నారని.. ఉప ఎన్నికలు వస్తాయో రావో కేటీఆరే చెప్పేస్తున్నారని మండిపడ్డారు. గతంలో సబితా ఇంద్రారెడ్డి ఏ బీ ఫామ్ మీద గెలిచారు..? ఎవరి మంత్రి వర్గంలో పనిచేశారు..? తలసాని శ్రీనివాస్ 2014లో గెలిచింది ఏ బీ ఫామ్ మీద, మంత్రిగా పనిచేసింది ఎవరి ప్రభుత్వంలో..? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కులగణన, ఎస్సీ వర్గీకరణలో కమిషన్లు ఇచ్చే నివేదికలు చట్టబద్ధం చేస్తామని చెప్పారు. వీటిలో ఎక్కడా రాజకీయ జోక్యం ఉండదన్నారు. రాజకీయ జోక్యం ఉండకూడదు అనే ఉద్దేశ్యంతోనే కమిషన్ ఏర్పాటు చేస్తున్నామని క్లారిటీ ఇచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపుతామని పేర్కొన్నారు.

# మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పులకుప్పలుగా మార్చారు

(మొదటి తరువాయి)

తెలంగాణకు ఇచ్చిన నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమా అని రేవంత్ ప్రభుత్వానికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. తెలంగాణలో జాతీయ రహదారుల కోసం లక్షా 20వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని అన్నారు. రూ. 80వేల కోట్ల పనులు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. కేంద్రం నుంచి రీజనల్ రింగ్ రోడ్, మెగా టెక్స్ టైల్ పార్క్, రైల్వే కోచ్ తెచ్చామని ఉద్ఘాటించారు. శనివారం నల్గొండలో కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పులి సరోత్తమ్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మూడు ఎన్నికల్లోనూ పోటీ చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమే అని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల అకాంక్షల కోసం బీజేపీ పనిచేస్తుందని అన్నారు. రూ. 7వేల కోట్లతో రామగుండంలో యూరియా ఉత్పత్తి చేసే పరిశ్రమ ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భూమి పూజ చేశారని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఎరువులకు సబ్సిడీ ఇస్తూ రైతులను బీజేపీ ఆదుకుంటుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు కేంద్రం ఏం ఇచ్చిందని అడగడం ఫ్యాషన్‌గా మారిందని విమర్శించారు. 2014 మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను పూర్తిగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే దివాలా తీయించామని ఆరోపించారు. 11 ఏళ్లలో రూ. 10 లక్షల కోట్లు రెండు పార్టీలు కలిసి అప్పులు చేశాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. అద్భుతమైన తెలంగాణ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# మోడీ కులం, రాహుల్ మతంపై చర్చకు సిద్ధం

ం (మొదటి తరువాయి)

చెప్పారు. బీసీల్లో ముస్లింలను కలిపితే కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఈ విషయం తెలిసికూడా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ది కోసం నాటకాలు ఆడుతుందని విమర్శించారు. ప్రధానమంత్రి మోడీ కులం, రాహుల్ గాంధీ మతంపై చర్చకు తాము సిద్ధమనీ, ఇదే అంశాన్ని రెఫరెండంగా భావిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికలకు వెళ్దామా అని కాంగ్రెస్ పార్టీకి సవాల్ విసిరారు. కుల గణన తప్పుల తడక, బీసీ జాబితాలో ముస్లింలను కలపడంపట్ల కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత నెలకొందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రధాని కులంపై సీఎం రేవంత్‌రెడ్డి అవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. శనివారంనాడిక్కడి టూరిజం ప్లాజాలో ఎనిమీ ప్రాపర్టీస్ (శత్రు ఆస్తులు)పై కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రంగారెడ్డి, హైదరాబాద్, కొత్తగూడెం, వికారాబాద్ జిల్లాల్లోని ఎనిమీ ప్రాపర్టీస్ (శత్రు ఆస్తులు) ఉన్నాయనీ, వాటిలో చాలా ఆస్తులు ఆక్రమణలకు గురయ్యాయనీ, వాటిని ఏ విధంగా స్వాధీనం చేసుకోవాలనే అంశంపై అధికారులతో చర్చించామనీ, దానిపై నివేదికను కోరినట్టు తెలిపారు. గతంలో పాకిస్తాన్‌తో యుద్ధం సందర్భంగా ఇండియా నుంచి పాకిస్తాన్ వెళ్లిన ప్రజలు, ఇక్కడ తమ ఆస్తులను వదిలేసి వెళ్లారనీ, పాకిస్తాన్ నుంచి ఇండియాకు వచ్చిన వాళ్లు అక్కడ తమ ఆస్తులను వదిలేశారని చెప్పారు. అయితే పాకిస్తాన్ ఆస్తుల ఒప్పందాన్ని ఉల్లంఘించి అమ్మేసుకుందనీ, ఈ నేపథ్యంలో దేశంలోని ఎనిమీ ప్రాపర్టీస్‌ను అమ్మేసి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాలని నిర్ణయించామన్నారు. తెలంగాణలో దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన ఎనిమీ ప్రాపర్టీస్ ఉన్నాయనీ, మార్చి నెలాఖరులోపు ఆయా ఆస్తులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. మోడీ ముమ్మాటికీ బీసీనే అనీ, 1994లో గుజరాత్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మోడీ కులాన్ని బీసీ జాబితాలో చేర్చిందని వివరించారు. మోడీ కేంద్ర మంత్రివర్గంలో 27 మంది బీసీలకు మంత్రిపదవులు ఇచ్చారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ఎంత మంది బీసీ మంత్రులు ఉన్నారని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో సర్వేచేస్తే 51 శాతం బీసీలు ఉన్నారని తేలిందనీ, ఇప్పుడు కుల గుణన సర్వేలో 46 శాతానికి ఎలా తగ్గిందని అడిగారు. రాహుల్ గాంధీ కులం, మతం, జాతి గురించి చర్చ జరగాలనీ, రాహుల్ గాంధీ తాత ఫిరోజ్ ఖాన్ అనీ, రాహుల్ తల్లి సోనియాగాంధీ క్రిస్టియన్, ఇటలీ దేశస్తురాలనీ, మరి రాహుల్ ఏ కులమని ప్రోత్సహిస్తున్నారని ప్రశ్నించారు.

## మోడీ కులం పై రేవంత్ వ్యాఖ్యల్లో తప్పులేదు



(మొదటి తరువాయి)

మతంపై బీజేపీ ఎంపీలు బట్టేబాజ్ మాటలు మాట్లాడుతున్నారని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. మోడీ కులం గురించి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీది ఏ కులం, ఏ మతమో చెప్పాలని కేంద్ర మంత్రి బండి సంజరు చెప్పాలనడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కులానికి అతీతంగా రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. కేంద్రప్రభుత్వానికి దమ్ముంటే.. దేశ వ్యాప్తంగా కులగణన చేసి బీసీల పట్ల కేంద్రానిది స్టాండ్ ఏందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ కులం అడగడమేందుకు? బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా కుల గణన చేయిస్తే.. రాహుల్ గాంధీనే ఆయన కులం ఏదో చెప్తారని ప్రశ్నించారు. రాహుల్ గాంధీనే సర్వేకు వెళ్ళిన వారికి సంతకం పెట్టి మరీ ఆయన కులం, మతం ఏంటో చెబుతారని స్పష్టం చేశారు. దేశం కోసం తూటాలకు బలై ప్రాణ త్యాగం చేసిన గాంధీ కుటుంబ గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. దేశం కోసం బీజేపీ నేతలు చేసిన త్యాగం ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. కల్వకుంట్ల కవిత పింక్ బుక్ ఓపెన్ చేస్తే ఆమె చేసిన కుంభకోణాలు బయటపడుతాయని చెప్పారు. అందుకే అటువంటి బుక్‌లు ఓపెన్ చేయొద్దని హెచ్చరించారు.

## ఏ లెక్కన 42శాతం రిజర్వేషన్లు ఇస్తారు

(మొదటి తరువాయి)

కోసం, అధికారం కోసం కొట్లాడుకుందాం కానీ రైతుల భవిష్యత్తు ఫణంగా పెట్టవద్దని హితవుపలికారు. రాష్ట్ర విభజన సభయంలో ఏడు మండలాలతో పాటు సీలేరు ప్రాజక్ట్ కోల్పోయామన్నారు. ఏపీలో టీడీపీ , బీజేపీ అలయన్స్ నడుస్తోందన్నారు. కొత్త ప్రాజెక్టుల కోసం అనుమతులు తెచ్చుకుంటున్నారని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల సర్వే పూర్తి చేసి ఫిగర్స్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో పెద్ద కుట్ర జరుగుతోందని విమర్శించారు. 46 శాతం ఉన్న బీసీలకు అదే స్థాయిలో విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు ఇవ్వాలన్నారు. బీసీల విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్ల కోసం ప్రత్యేక బిల్లులు పెట్టాలన్నారు. మూడు బిల్లులు పెట్టకపోతే కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేనట్టే అని అన్నారు. 'మీకు నిజాయితీ ఉంటే సిన్సియర్‌గా రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటే మూడు బిల్లులు పెట్టండి. రేవంత్ రెడ్డి తనకు అవసరమైనప్పుడు బీజేపీ నేతలతో మాట్లాడిస్తుంటారని కవిత వెల్లడించారు. ఉదయం ఖమ్మం జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటించారు. ఈ సందర్భంగా ఖమ్మం సబ్ జైల్లో రిమాండ్‌లో ఉన్న లక్కినేని సురేందర్‌ను పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..లక్కినేని సురేందర్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపడ్డారు. కేసీఆర్‌ను కట్టడి చేయాలని చూస్తున్నారన్నారు. కొందరిని అరెస్ట్ చేస్తే కేసీఆర్‌ను అడ్డుకున్నట్టా అని ప్రశ్నించారు. రైతుబంధు రాలేదు, భీమా రాలేదు, ఫించన్ రాలేదు, ఉద్యోగాలు రాలేదు, అన్నీ దొంగ మాటలే అంటూ విరుచుకుపడ్డారు. 14 నెలల పాలనలో దొంగ హామీలే తప్ప చేసింది లేదన్నారు. ఖచ్చితంగా ప్రశ్నిస్తామని.. పాలించడం చేతకాక అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా తగ్గేదే లేదని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. కేసులకు భయపడొద్దని.. ప్రజాక్షేత్రంలో పోరాడుతూనే ఉందామని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు. ఏ కారణం లేకుండా బీఆర్ఎస్ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న నాయకులను టార్గెట్ చేస్తున్నార కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని మండిపడ్డారు. అక్రమ కేసులతో కేసిఆర్ సైన్యాన్ని కట్టడి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని, కానీ కెసిఆర్ ని, కెసిఆర్ సైన్యాన్ని కట్టడి చేయడం ఎవరికి సాధ్యం కాదని తేల్చిచెప్పారు.

## జీరో గ్రావిటీ నుంచి గ్రావిటీకి సునీత విలియమ్స్

(మొదటి తరువాయి)

ఉంటుంది. వారి దేహం సాధారణ స్థితికి రావడానికి కొంత సమయం పడుతుందని నాసా నిపుణులు తెలిపారు. ఇప్పటికే వారి తిరుగు ప్రయాణం దాదాపు ఖరారైంది. ఎనిమిది నెలల ఎదురుచూపుల తర్వాత.. మార్చి 19న వారు భూమి మీదకు బయల్దేరనున్నారు. జీరో గ్రావిటీ నుంచి గురుత్వాకర్షణ కలిగిన భూ వాతావరణంలోకి రానున్న వారికి సమస్యలు తప్పవని అంటున్నారు. వారి దేహం మొత్తం చిక్కి శల్యమైనట్లుగా మారింది. వారికి ప్రత్యేక వైద్య పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఇదేగాకుండా అంతరిక్షంలో ఎక్కువ కాలం ఉండటం కూడా వారి ఆరోగ్య పరిస్థితిపై ప్రభావం చూపుతుంది. ఒక వ్యోమగామి అంతరిక్షంలోకి ప్రవేశించిన వెంటనే శరీరం స్పేస్ ఎనీమియాకు గురవడం మొదలవు తుందని నాసా నివేదిక చెబుతోంది. ఎర్రరక్తకణాలను నాశనం చేయడం ద్వారా మైక్రోగ్రావిటీ పరిస్థితుల్లో శరీరం ఆక్సిజన్ అవసరాలను తగ్గించుకుంటుంది. శరీరంలో సమతుల్యతను కాపాడే క్రమంలో వాటి సంఖ్య తగ్గిపోతూ ఉంటుంది. దాంతో అలసట, నిస్సత్తువ, శారీరక, మానసిక పనితీరు దెబ్బతినడం వంటి లక్షణాలు కనిపించొచ్చు. అలాగే గుండె పనితీరు దెబ్బతినే అవకాశమూ ఉంది. ఎముకల సాంద్రత తగ్గిపోతుంది. అందుకే వారు తిరిగి వచ్చాక పెన్సిల్ లేపినా వర్కౌట్ చేసినట్టే ఉంటుంది. ఈవిషయాన్ని విల్మోర్ మీడియాకు వెల్లడించారు. 'గ్రావిటీలో చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది. భూమిపై పరిస్థితులకు సర్దుకుపోయే క్రమంలో అసౌకర్యంగా ఉంటుంది. శరీరమంతా భారమైన భావన కలుగుతుంది. పెన్సిల్ ఎత్తినా వర్కౌట్‌తో సమానమవుతుందని విల్మోర్ వెల్లడించారు. స్పేస్‌లో తెలియాడుతూ ఉండే వ్యోమగాములు.. భూమి మీదకు వచ్చిన 24 గంటల్లో ఆ ప్రత్యేక అనుభూతికి దూరమవుతూ ఉంటారు. బోయింగ్ క్రూ ఫ్లైట్ టెస్ట్‌లో భాగంగా నాసా గత జూన్‌లో ఈ ప్రయోగాత్మక పరీక్ష చేపట్టింది. అయితే వారంలోగా వ్యోమగాములు భూమి పైకి తిరిగి రావాల్సిఉంది. కానీ, ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ యాత్రలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వాహక నౌక థ్రస్టర్లలో లోపాలు తలెత్తటంతో పాటు హీలియం లీకేజీ సమస్యగా పరిణమించింది. దీంతో అందులో ప్రయాణించడం సురక్షితం కాదని నాసా తేల్చింది. దాంతో ఎనిమిది నెలలుగా వారు అంతరిక్ష కేంద్రంలోనే ఉండిపోయారు. స్పేస్‌ఎక్స్‌కు చెందిన డ్రాగన్ వ్యోమనౌకలో వారు తిరిగి భూమి మీదకు బయల్దేరనున్నారు. వారు చేరుకున్న తరవాత పరిస్థితులు అధ్యయనం చేస్తారు.

## నెట్‌జీరో సీటీగా ఫ్యూచర్ సీటీ నిర్మాణం

(మొదటి తరువాయి)

ఫ్యూచర్ సిటీపై ఎంఓయూ కుదుర్చు కున్నాం. రాష్ట్రాభివృద్ధి, అన్ని వర్గాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలు ఉంటాయి. పర్యావరణ పరిరక్షణ కోసం ఇప్పటికే కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచేలా మినహాయింపునిచ్చాం. రాష్ట్ర ఆదాయం తగ్గుతుందని తెలిసినా.. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఈవీ పాలసీ తీసుకొచ్చాం. హైదరాబాద్ నగర మౌలిక సదుపాయాలను మరింత పెంచేలా రూ.10 వేల కోట్లను కేటాయించాం. మూసీ సుందరీకరణ చేపట్టాం. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో స్థిరాస్తి రంగం ఆశించిన స్థాయిలో ఉంది. స్థిరాస్తి వ్యాపారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది' అని భట్టి అన్నారు.

## పది పరీక్షల నిర్వహానకు పటిష్ట భద్రత

(మొదటి తరువాయి)

ఇప్పటికే ప్రారంభమైన ఇంటర్ ప్రయోగ పరీక్షలపై పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందనీ, వాటిని బోర్డులోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా కఠినమైన నిఘా ఉంటుందని వివరించారు. దేశ వ్యాప్తంగా ఉన్న విద్యా వ్యవస్థలకు ఇదొక ఉదాహరణగా నిలుస్తుందని ఆయన వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలలో ఏర్పాటు చేసిన 8 వేలకి పైగా కెమెరాలను పర్యవేక్షించడానికి 40 మంది సిబ్బందితో ఓ కమాండ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్చి 5 నుంచి 25 వరకు జరగనున్న సమయంలో పారదర్శకత, సమగ్రత, భద్రతను నిర్ధారించడం ఈ నిఘా వ్యవస్థ ప్రధాన లక్ష్యం. ఈ మేరకు విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, జ్యోత్స్నారెడ్డి పరీక్ష కేంద్రాల్లో కెమెరా వ్యవస్థ పనితీరును పరిశీలించారు. ఇంటర్ పరీక్షల్లో అవకతవకలకు పాల్పడకుండా లీకేజీలను నివారించడానికి, పరీక్ష మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండేలా ఏకకాలంలో పర్యవేక్షించడానికి వీలు కల్పిస్తుంది. ఎస్ఎస్‌సీ హిందీ ట్రాన్స్‌లేటర్స్ పేపర్ 1 ఫలితాలు వచ్చేశాయ్.. ఎంత మంది క్వాలిఫై అయ్యారంటే? స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ పరీక్ష ఫలితాలు తాజాగా విడుదలయ్యాయి. ఈ మేరకు కమషన్ ప్రకటనను జారీ చేసింది. కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ (పేపర్-1) పరీక్ష డిసెంబర్ 9న దేశవ్యాప్తంగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్ష ద్వారా మొత్తం 312 ఖాళీలు భర్తీ చేయనున్నారు. పేపర్ 1లో క్వాలిఫై అయిన వారికి పేపర్2 (డిస్క్రిప్టివ్) పరీక్షకు హాజరు కావడానికి అవకాశం ఉంటుంది. పేపర్‌లో మొత్తం 2145 మంది అభ్యర్థులు షార్ట్‌లిస్ట్ చేసినట్లు కమిషన్ వెల్లడించింది.

## తుదిదశకు చేరుకున్న మహాకుంభమేళా

(మొదటి తరువాయి)

పోతున్నాయి. రైళ్లు కిటకిటలాడుతున్నాయి. ఇటీవల రికార్డు స్థాయిలో 350 కి.మీ. మేర వాహనాలు బారులు తీరిన విషయం తెలిసిందే. జనాలు భారీగా రావడంతో ప్రయాగ్‌రాజ్ సంగమ్ రైల్వేస్టేషన్‌ను మూసివేయాల్సిన పరిస్థితి ఎదురైంది. ఈ నేపథ్యంలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వానికి ఓ విజ్ఞప్తి చేశారు. గతంలో కుంభమేళాను 75 రోజులు నిర్వహించిన సందర్భాలున్నాయి. కానీ ఇప్పుడు ఆ గడువు తక్కువగా ఉంది. ప్రస్తుతం ప్రతి ఒక్కరు మహాకుంభమేళాకు వెళ్లాలని అనుకుంటున్నారు. కానీ వెళ్లలేకపోతున్నారు. ప్రభుత్వం ఈ గడువు పెంచాలని యాదవ్ సూచించారు. ప్రతి 12 ఏళ్లకు ఓసారి నిర్వహించే ఈ మహా కుంభమేళా జనవరి 13న మొదలు కాగా.. ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. మొత్తం 40 నుంచి 45 కోట్ల మంది రావచ్చని తొలుత అంచనా వేశారు. కానీ, అంచనాలకు మించి భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు వస్తున్నారు. ప్రపంచం నలుమూలల నుంచి నిత్యం సరాసరి కోటిన్నర మంది వస్తుండటం గమనార్హం. జనవరి 29న మౌని అమావాస్య రోజే దాదాపు 8 కోట్ల మంది ప్రయాగ్‌రాజ్‌కు వచ్చినట్లు యూపీ ప్రభుత్వం పేర్కొంది. భక్తుల సంఖ్య 50 కోట్లు దాటడంపై స్పందించిన యూపీ ప్రభుత్వం.. భారత్, చైనా మినహా అన్ని దేశాల జనాభాను ఈ సంఖ్య దాటేసిందని పేర్కొంది.

# అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ వెంటనే ఏర్పాటు చేయాలి..

- తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ స్వర్ణలత రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్..
- తరిగొప్పుల మహేందర్ మరియు అమరేందర్ ఆధ్వర్యంలో రోడ్లపైకి న్యాయవాదులు నిరసన
- ఇలాంటి సంఘటన ఇంకోటి జరగకుండా కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు న్యాయవాది తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి డిమాండ్..









తెలంగాణ హైకోర్టు న్యాయవాదురాలు స్వర్ణలత & తెలంగాణ రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు

ప్రజా స్వేచ్ఛ రంగారెడ్డి జిల్లా

హైదరాబాద్ లోని రంగారెడ్డి జిల్లా కోర్టులో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. జీవిత ఖైదు పడిన ఓ నేరస్తుడు కోపం తట్టుకోలేక జడ్జి పట్ల దురుసుగా ప్రవర్తించాడు. పోక్సో కోర్టు న్యాయమూర్తిపై చెప్పు విసిరాడు. పోక్సో కేసులో తనను జడ్జి దోషిగా ప్రకటించడంతో జీర్ణించుకోలేకపోయాడు. జడ్జిపై చెప్పు విసిరాడు. జరిగిన ఘటనతో అక్కడున్న వారంతా షాక్ కు గురయ్యారు. కోర్టులో ఉన్న న్యాయవాదులు నేరస్తుడిని పట్టుకుని చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఘటన సందర్భంగా తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ స్వర్ణలత కేంద్ర ప్రభుత్వాన్ని మరియు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ విధంగా చెప్పడం జరిగింది . వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ఏర్పాటు చేయాలని అందులో న్యాయవాదులకు గాని న్యాయమూర్తులకు గాని జ్యుడీషియల్ లో పనిచేస్తున్న స్టాఫ్ ఉద్యోగస్తులకు గాని ఈ మధ్యకాలంలో దాడులు జరుగుచున్నవి కావున ఇలాంటి సంఘటన జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ను ఏర్పాటు చేసి న్యాయమూర్తులను మరియు జ్యుడీషియల్ స్టాఫ్ లో ఉన్న వారందరినీ ఇలాంటి సంఘటన మరొకటి జరగకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని మరియు రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు న్యాయవాది స్వర్ణలత ప్రభుత్వాలను డిమాండ్ చేయడం జరిగింది ఈ సందర్భంగా తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఆధర్యంలో న్యాయవాదులు రోడ్లపైకి వచ్చి నిరసన చేస్తూ వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ఏర్పాటు చేయాలని తమ విధులను వదిలి మరి రోడ్లపైకి నిరసన చేయడం జరిగింది

## శారీరక సంబంధం లేకుండా భార్య మరో వ్యక్తిని ప్రేమించడం అక్రమ సంబంధం కిందకు రాద

**- మధ్యప్రదేశ్ హై కోర్టు**





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ

శారీరక సంబంధం పెట్టుకోకుండా భార్య మరో వ్యక్తిని ప్రేమించడాన్ని అక్రమ సంబంధంగా పరిగణించలేమని మధ్య ప్రదేశ్ హై కోర్టు తీర్పు ఇచ్చింది. లైంగికంగా కలిస్తేనే అక్రమ సంబంధం అవుతుందని జస్టిస్ జీ ఎస్ అహ్లువాలియా పేర్కొన్నారు. తన భార్య వేరే వ్యక్తిని ప్రేమిస్తున్నందున భరణం పొందే హక్కు లేదన్న భర్త వాదనను హై కోర్టు తోసిపుచ్చింది. భర్త నెలకు 4000 రూపాయలు మధ్యంతర భరణం చెల్లించాలన్న ఫ్యామిలీ కోర్టు ఆదేశాలను సమర్థించింది.

## కొత్త రేషన్ కార్డులపై బిగ్ అప్‌డేట్.. జరగబోయేది ఇదే..






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ

తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ ఇంకా కంటిన్యూ అవుతోంది. ఇప్పటిదాకా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కొత్త కార్డులు జారీ చేసిన సర్కారు.. నూతనంగా దరఖాస్తు చేసే చాన్స్ కూడా కల్పిస్తోంది. దీంతో మీ-సేవా కేంద్రాల దగ్గర భారీగా జనం బారులు తీరుతున్నారు. గత రెండ్రోజుల నుంచి మీ-సేవా సెంటర్ల దగ్గర భారీగా రద్దీ నెలకొంటోంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా కార్డు రాకపోవడంతో వాళ్లలో చాలా మంది మీ-సేవలో తిరిగి అప్లయ్ చేసుకుంటున్నారు. ఈ తరుణంలో కొత్త రేషన్ కార్డులపై బిగ్ అప్‌డేట్ వచ్చింది. ఇప్పట్లో నూతన రేషన్ కార్డులు లేనట్లేనని తెలుస్తోంది. దీనిపై మరిన్ని వివరాలు ఇప్పుడు చూద్దాం..

### అప్పటివరకు కొత్తవి లేనట్లే!

ప్రస్తుతం తెలంగాణలోని పలు జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ స్థానానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది. అటు మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంగనర్‌లో టీచర్ ఎమ్మెల్సీకి నగారా మోగింది. ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ జరగనుంది. ఎన్నికల కారణంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చింది. దీంతో ఇది ముగిసేవరకు రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోనుంది. గ్యాడ్యుయేట్, ఎమ్మెల్సీ ఎలక్షన్ ముగిశాకే నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలవనుందని తెలుస్తోంది. అయితే కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియ మాత్రం కొనసాగుతుందని.. ఇది నిరంతర ప్రక్రియ అని, మీ-సేవా కేంద్రాల్లో అప్లయ్ చేసుకోవాలని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిశీలించి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని అంటున్నారు..

## కులగణనలో పాల్గొనని వారికి నేటి నుంచి నమోదు కార్యక్రమం

-పాల్గొనని వారికోసం మరో అవకాశం కల్పించిన ప్రభుత్వం


-ఎంపిడిఓ జె రాములు నాయక్



**ఆలేరు ఆర్సీ, ఫిబ్రవరి 15** ప్రజా స్వేచ్ఛ

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కులగణనలో పాల్గొనని వారికోసం తెలంగాణ ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. నేటి నుంచి 28 ఫిబ్రవరి వరకు టోల్ ఫ్రీ నంబరు: 040 21111111 కు కాల్ చేస్తే ఎన్యూమరేటర్లు వారి ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారు.మీ సమీపంలో ఉన్న ప్రజాపాలన కేంద్రం ఎంపిడిఓ ఆఫీసుకు వెళ్లి వివరాలు నమోదు చేసుకోవచ్చునని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

# తెలంగాణలో మరోసారి కులగణన సర్వే





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ హైదరాబాద్,ఫిబ్రవరి 15

తెలంగాణలో మరోసారి కులగణన సర్వే మొదలుకానుంది.రేపటి (ఆదివారం) నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రెండో సారి కులగణన సర్వే ప్రారంభంకానున్న నేపథ్యంలో తెలంగాణ సర్కార్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మొదటి విడతలో కులగణన సర్వేలో పాల్గొనని వారికి మరో అవకాశం ఇవ్వనున్నారు. ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు సర్వే కొనసాగనుంది.మూడు విధాలుగా వివరాల నమోదుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఎన్యూమరేటర్లను పిలిపించుకునే ఛాన్స్ కూడా ఇచ్చింది. ఈ రోజు సాయంత్రం 4 గంటలకు జిల్లాల కలెక్టర్లతో సీఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. సర్వేపై కీలక సూచనలు చేసి టోల్ ఫ్రీ నంబర్‌ను సీఎస్ ప్రకటించనున్నారు.ఆన్ లైన్‌లో ఫామ్స్ డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు ఇచ్చే అవకాశం కూడా ఉంటుంది.నేరుగా మండల పరిషత్ కార్యాలయం వెళ్లి వివరాలు సమరించేందుకు అవకాశం ఉంది. కాగా.. గత ఏడాది నవంబర్ 6 నుంచి డిసెంబర్ 25 వరకు మొదటి సారి కులగణన సర్వే నిర్వహించింది ప్రభుత్వం.బీసీ జనాభా లెక్కల కోసం ప్రభుత్వం ఈ కులగణన సర్వేను చేసింది. అందుకు సంబందించిన వివరాలను కూడా సర్కార్ బయటపెట్టింది.ఈ సర్వేలో 3 కోట్ల 54 లక్షల పై చిలుకు మంది తమ వివరాలను నమోదు చేసుకున్నట్లు ప్రభుత్వం వివరించారు.ఇది రాష్ట్ర జనాభాలో 96.9 శాతంగా నమోదు అయ్యింది.మరొక 3.1శాతం జనాభా కుటుంబ సర్వేలో పాల్గొనలేదని స్పష్టం చేసింది.అందులో ప్రధానంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన కీలక నేతలు కూడా సర్వేలో వివరాలు నమోదు చేసుకోలేదని వెల్లడించింది. కేసీఆర్, కేటీఆర్,హరీష్ రావు వంటి నేతలు ఈ సర్వేలు వివరాలు నమోదు చేసుకోలేదు. 3.1 శాతం ప్రజలు వివిధ కారణాలతో ఈ సర్వేలో పాల్గొనలేదు.దీనిపై సమగ్రంగా వివరాలు వచ్చి తర్వాతే బీసీ రిజర్వేషన్లపై ముందు్కు వెళ్లాలనే డిమాండ్లు వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కులగణన సర్వే చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా రేపటి నుంచి సర్వే ప్రారంభంకానుంది.దాదాపు 12 రోజుల పాటు సర్వేను జరుగనుంది.కులగణన సర్వేలో పాల్గొనని వారు మరోసారి వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఇచ్చింది సర్కార్..

# జన్నారంలో 40 పడకల కమ్యూనిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ

15 - 2 - 2025 శనివారం రోజున జన్నారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వివిధ కుల సంఘాల వారు మరియు విశ్రాంత ఉద్యోగులు సమావేశమై జన్నారం మండలానికి సంబంధించిన పలు సమస్యలపై చర్చించి ప్రజలకు అత్యవసరంగా పరిష్కరించాల్సిన సమస్యలలో ప్రధానమైనదిగా ఈ ప్రాంత ప్రజలకు వైద్య సదుపాయం ఏర్పాటు చేయుటకు 40 పడకల కమ్యూనిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని నూతనంగా ఎన్నికైన కమిటీ తీర్మానించింది జన్నారం పట్టణం సమీపంలోని కడెం దస్తురాబాద్ మరియు దండేపల్లి లోని అనేక గ్రామాలకు కేంద్రముగా ఉన్నందున మరియు ఈ మండలాలలో ఎక్కువ మంది గిరిజన దళిత వెనుకబడిన కులాల పేద ప్రజలు ఎక్కువగా ఉంటూ తమ వైద్యం కొరకు 60 కిలోమీటర్ల పైబడి దూరాన గల మంచిర్యాల్ జగిత్యాల్ నిర్మల్ మరియు ఆదిలాబాద్ కు వ్యయ ప్రయాసలకు ఓర్చ వెళుతున్నారు కాబట్టి ఇక్కడ కమ్యూనిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయడం వలన సుమారు లక్షమంది ప్రజలు వైద్య సదుపాయం పొందే వీలుంది కాబట్టి ఈ సమస్యను న్యాయమైనదిగా భావించి స్థానిక ఎమ్మెల్యే , పార్లమెంటు సభ్యుడు మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి గారు వెంటనే స్పందించి ప్రజల ఆకాంక్షల కణుగునంగా 40 పడకల కమ్యూనిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయించుటకై తగు చర్య తీసుకోగలరని కోరుతున్నాము ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన కన్వీనర్ శ్రీ రామోజు కొండయ్య గారు కో కన్వీనర్ లుగా కోదూరి చంద్రయ్య గారు ఆదేపు లక్ష్మీనారాయణ గారు కడార్ల నరసయ్య గారు మూల భాస్కర్ గౌడ్ గారు కుంట మహేష్ గారు అడ్డగూరి భూమన్న గారు కోడి జుట్టు రాజయ్య గారు కస్తూరి నాగేశ్వర్ గారు గుర్రాల మురళీ గారు శ్రీరామల భూమా చారి గారు ఒల్లాల నర్సా గౌడ్ గారు కస్తులాపురి నాగేందర్ గారు ఐలవేణి రవి గారు నాయిని లచ్చన్న గారు మర్రిపల్లి శేఖర్ గారు రాచకొండ రాజేష్ గారు గొల్లపల్లి వెంకటరమణ గారు శ్రీరాముల భూమా చారి గారు ప్రెస్ పురుషోత్తం గారు తదితరులు పాల్గొన్నారు

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఈగ మల్లేశం



**హసన్ పర్తి,15ఫిబ్రవరి,ప్రజా స్వేచ్ఛ**

నూతన వధూవరులను కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల బోర్డు పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ఆశీర్వదించారు. శనివారం హసన్ పర్తి మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ భూషబోయిన సంపత్ యాదవ్ కుమారుని వివాహానికి కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల బోర్డు పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్,గ్రేటర్ వరంగల్ మాజీ డిప్యూటీ మేయర్ కక్కె సారయ్య,వీరితో పాటు మాజీ జడ్పీటీసీలు,మాజీ కార్పొరేటర్లు,మాజీ సర్పంచ్ లు,టిఎన్జిఓస్ నాయకులు మార్గం భిక్షపతి, సమ్మయ్య,మల్లయ్య,సిలువేరు కుమారస్వామి , సోమన్న, వెంకటేశ్వరరావు, ఐలయ్య,కరిమిల్ల సంపత్ రావు,గుమ్మడి హరిబాబు ,నెహ్రూ రెడ్డి, అన్నమనేని దేవేందర్ రావు,సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# గోపనపల్లీ తండా లో నెలకొన్న సమస్యలకు పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటాం

-గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి



**,ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 15 శేరి లింగంపల్లి**
శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లీ తండా లో స్థానిక ప్రజా సమస్యలపై గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కాలనీ వీదుల్లో పర్యటించి అక్కడి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ కాలనిలో భూగర్భ డ్రైనేజీ, మంచి నీటి పుప్ లైన్లు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి దృష్టికి తీసుకురాగా వెంటనే కార్పొరేటర్ స్పందించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన నిధులు కేటాయించి సమస్యను వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. పెరుగుతున్న జనాభా దృశ్య డ్రెయినేజీ పైప్ లైన్ డయా పెంచి లెవల్స్ తో అనుసంధానం చేస్తూ ఒక్క కాలనీ నుండి మరొక కాలనీ కి మధ్యన ఇబ్బందులు తల్లెత్తకుండ పనులు ప్రణాళిక బద్దంగా అన్ని కాలనీలకు దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. పురాతన నీటి పైపులైన్‌లను ఆధునిక పైపులైన్‌లతో మార్చి, నీటి సరఫరా వ్యవస్థ మెరుగుపరిచి పరిపుష్టమైన మంచినీటి సరఫరా కోసం కొత్త మోటార్‌లు & పంప్‌హౌస్‌లు . ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకోని రావాలని ప్రజలను కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యుఎస్ మేనేజర్ అభిషేక్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా గిరిజన మోర్చా మాజీ అధ్యక్షులు హనుమంతు నాయక్, సీనియర్ నాయకులు శ్రీరామ్ నాయక్,రాజు నాయక్, రాణి, నర్సింగ్ నాయక్, ప్రకాశ్, నరసింహ, సుమన్, రాజు , నరసింహ, మోహన్ రెడ్డి,రాజ్ కుమార్, బాబు, శంకర్,శ్యామ్ రాథోడ్, రాములు నాయక్, సంతోష్ నాయక్, శ్రీశైలం, కృష్ణ, దేవ,నరేందర్, గోవర్ధన్,గోపనపల్లీ తండా కాలనీ వాసులు,కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు,స్థానిక నేతలు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థ పటిష్టం పై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



**వనపర్తి. ,ప్రజా స్వేచ్ఛ 15.ప్రతినిధి. వనపర్తి.**
200 కోట్ల రూ,..తో శ్రీనివాసపురంలో, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటుకు శ్రీకారం. విద్యార్థులకు దుస్తులు, విద్యా ఉపకారణాల పంపిణీ కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డి. తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ ప్రత్యేక దృష్టి సారించిందని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు సైతం ఉన్నత విద్యను అందించాలన్న ఉద్దేశంతో ముందుకెళ్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాసపురం పాఠశాలలో శనివారం విద్యార్థులకు, ఏకరూప దుస్తులు, విద్యాభ్యాస ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మాట్లాడుత, గ్రామాలలోని పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. గ్రామస్తుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్నాయకులు ఉమ్మాల రాములు వితరణ చేసిన విద్యాభ్యాసన ఉపకరణాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని ఈ విధంగా దాతలు ముందుకు వచ్చి పాఠశాల బలోపేతం కోసం పాటుపడాలని ఎమ్మెల్యే సూచించారు. రానున్న కాలంలో వనపర్తి జిల్లాలో శ్రీనివాసపురానికి ప్రత్యేక గుర్తింపు వస్తుందని జిల్లా మహిళా సమైక్య భవనం సైతం శ్రీనివాసపురం లోనే నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు వనపర్తి మున్సిపాలిటీ శ్రీనివాసపురం పాఠశాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు తాను ఎల్లవేళలా సహకరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులను విద్యాభ్యాసన ఉపకరణాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ జెడ్పిటిసి గొల్ల వెంకటయ్య, న్యాయవాది తిరుపతయ్య, స్థానిక మాజీ కౌన్సిలర్ విభూది నారాయణ విద్యాధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, మరియు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## జి.చిన్నారెడ్డి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు ని కలసిన బిఆర్ఎస్ బృందం



**వనపర్తి. ,ప్రజా స్వేచ్ఛ 15. ప్రతినిధి. వనపర్తి.**
మాజీ మంత్రి వర్యులు నిరంజన్ రెడ్డి కృషి చేసి సాధించిన బైపాస్ రోడ్డు, పాలిటెక్నిక్ దురస్థు ,వసతి గృహాల పునః నిర్మాణం వంటి అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, బైపాస్ రోడ్ కోసం 73 కోట్లు, పాలిటెక్నిక్ దురాస్తు కోసం 22 కోట్లు మంజూరు అయినాయని వాటిని వెంటనే ప్రారంభించేవిధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. అదేవిధంగా ఎస్.నిరంజన్ రెడ్డి సాధించిన ఐ.టి టవర్ నిలబెట్టినందుకు బిఆర్ఎస్ బృందం ధన్యవాదాలు తెలపడం జరిగింది. స్పందించిన డాక్టర్. జి.చిన్నారెడ్డి, ముమ్మాటికీ ఐ.టి.టవర్ మంజూరు నిరంజన్ రెడ్డి కృషి అని భవిష్యత్తు తరాలకోసం నిలబెట్టడం జరిగిందని అన్నారు. అదేవిధంగా బై పాస్ రోడ్డు మరియు పాలిటెక్నిక్ పునః నిర్మాణం నిలిచిపోయిన పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం సమర్పించిన వారిలో బి.ఆర్.ఎస్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్, ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి, మాజీ కౌన్సిలర్ ఉంగ్లమ్ తిరుమల్, మండల యువత అధ్యక్షులు చిట్యాల.రాము, మైనార్టీ సెల్ అధ్యక్షులు జోహేబ్ హుస్సేన్, వజ్రాల రమేష్ ఉన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి డిగ్రీ కళాశాల విద్యార్థి సనాశిరేనికి గోల్డ్ మెడల్




**,ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 15 భువనగిరి ప్రతినిధి**
భువనగిరి పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (ఏ జెడ్ సి )కోర్సులో 9.69 మార్కులతో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన భువనగిరి పట్టణానికి చెందిన అల్లైడ్ మెడికల్ యాజమాని మహమ్మద్ సర్వర్ కూతురు సనాషరీన్ కి శనివారం హైదరాబాద్ ఎక్సిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు చేతులో మీదుగా గోల్డ్ మెడల్ అందించడం జరిగింది. ఈ సందర్భంగా సనా షీరిన్ కి కాలేజ్ యాజమాన్యం, మైనార్టీస్ డెవలప్మెంట్ కమిటీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హఫీజ్ వసీం,తల్లిదండ్రులు మరియు బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలియజేసి సనా శీరిన్ ఇలాగే కష్టపడి చదివి భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని కోరారు

## ప్రారంభమైన తెలంగాణ జాతిపిత కెసిఆర్ జన్మదిన వేడుకలు



**వనపర్తి. ,ప్రజా స్వేచ్ఛ 15. ప్రతినిధి. వనపర్తి.**
వృక్షార్చన కార్యక్రమంలో, భాగంగా మొక్కలు నాటిన జిల్లా అధ్యక్షులు, అధికార ప్రతినిధి. బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, జయంతి సందర్భంగా ముందస్తు జన్మదిన వేడుకలు జిల్లా పార్టీ కార్యాలయంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి కెసిఆర్ కి, ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ, కెసిఆర్ పాలనలో తెలంగాణ పచ్చదనంతో పాడి పంటలతో కళకళలాడింది అని, అని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారు అని మళ్ళీ కెసిఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. భవిష్యత్తు తెలంగాణ అభివృద్ధి కోసం కెసిఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నందిమళ్ళ అశోక్, మాజీ కౌన్సిలర్ నాగన్న యాదవ్, కంచే.రవి, స్టార్ రహీమ్, హేమంత్ ముదిరాజ్, చిట్యాల. రాము, జో హెబ్బ్ హుస్సేన్, ఆరీప్, క్రాంతి కుమార్, నీలంభాను రఘు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## షబ్బీర్ అలీ కి జన్మదిన శు భాకాంక్షలు తెలిపిన జమీరుద్దీన్




**,ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 15 రామన్నపేట ప్రతినిధి**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ జన్మదినం సందర్భంగా శాలువాతో సత్కరించి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ వైస్ చైర్మన్ రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ మొహమ్మద్ అక్రం తదితరులు పాల్గొన్నారు

## కూకట్‌పల్లి నియోజకవర్గ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ నూతన కార్యవర్గం నియామకం

-అధ్యక్షులుగా నిమ్మల శ్రీనివాస్ ,ప్రధాన కార్యదర్శిగా కోహీర్ నాగరాజు యాదవ్



**కూకట్‌పల్లి,,ప్రజా స్వేచ్ఛ ప్రతినిధి:**
తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(143) కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం నారాయణ,ప్రధాన కార్యదర్శి ఆస్కాన్ని మారుతి సాగర్‌లు ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా నిమ్మల శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శిగా కోహీర్ నాగరాజు యాదవ్, కోశాధికారిగా సదా మహేష్ లను నియమిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. నియామక ఉత్తర్వులను రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.మారుతి సాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్కే దయాసాగర్‌లు త్వరలో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. జర్నలిస్టు సంక్షేమ కోసం గత పది సంవత్సరాలుగా టీయూడబ్ల్యూజే 143 ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వివరించారు. కూకట్ పల్లిలో అర్హులైన జర్నలిస్టులందరికీ సంక్షేమ కార్యక్రమాలు అందేలా,వారి సమస్యల పరిష్కారానికి మన యూనియన్ తరపున కృషి చేయాలని కోరారు.

## ధర్మబిక్షం ఆశయాలను కొనసాగిస్తాం

– యాదయ్య



**ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 15 వలిగొండ (ప్రతినిధి)**
సిపిఐ మండల శాఖ ఆధ్వర్యంలో వలిగొండ పట్టణ కేంద్రంలోని ప్రధాన కూడలిలో కామ్రేడ్.బొమ్మగాని ధర్మబిక్షం103 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య మాట్లాడుతూ అప్పటి నైజాం రాచరిక వ్యవస్థ పై తిరుగుబాటు చేసిన గొప్ప మహాయోధుడు,పీడిత ప్రజల విముక్తికై తెలంగాణ సాయుధ పోరాటాన్ని కొనసాగించి ఆనాటి నైజాం నవాబును ఎదిరించిన వీర యోధులు ఆ రోజుల్లో ఆర్య సమాజంతో పాటు 1940 విద్యార్థుల సమస్యలు పాస్టర్ల సమస్యలు,దున్నేవాడికి భూమి అన్నట్లుగా గీసే వాడిదే చెట్టు అనే నినాదం కూడా ఇచ్చాడు. అనేక ఉద్యమాలు చేసి ప్రజలను చైతన్య పరచి రాచరిక వ్యవస్థను కూలదొయ్యడంలో ప్రముఖమైన నాయకుడని అన్నారు. అప్పటి నైజాం రాచరిక వ్యవస్థ పై ప్రజలను చైతన్య పరచి తిరుగుబాటు చేశారు. పీడిత ప్రజల విముక్తికై తెలంగాణ సాయుధ పోరాటాన్ని కొనసాగించి ఆనాటి నైజాం నవాబును ఎదిరించిన వీర యోధుడు కామ్రేడ్ ధర్మ బిక్షం అని అన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా,రెండుసార్లు పార్లమెంటు సభ్యులుగా , కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాయకులుగా ప్రజలకు అనేకమైన సేవలు అందించరాని అన్నారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్,సిపిఐ పట్టణ కార్యదర్శి సుద్దాల సాయికుమార్,మచ్చ లక్ష్మీనారాయణ,బొడిగ సుదర్శన్,పారుపల్లి నరసింహ,చొప్పరి వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు



**,ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 15 శేరిలింగంపల్లి ప్రతినిధి (అశోక్ )**
మియాపూర్ నడిగడ్డ తండాలో బంజారాల ఆరాధ్య దైవమైనటువంటి శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని గిరిజన సమక్షమ సంఘం ఆధ్వర్యంలో మరియు నడిగడ్డ తండ బంజారా యూత్ అసోసియేషన్ వారి సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నేషనల్ షెడ్యూల్ ట్రైబ్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ మరియు మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, డాక్టర్. రాంసింగ్, మోహన్ సింగ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా జాటోత్ హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ నడిగడ్డ తండా గిరిజనులు పడుతున్న ఇబ్బందులు చూశాననీ, మీకు సాధ్యమైనంత త్వరలో మీ సమస్యలు పరిష్కారం చేయడానికి కృషి చేస్తాననీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ తండా అధ్యక్షులు అల్వార్ స్వామి నాయక్, తిరుపతి నాయక్, సీతారాం నాయక్, హనుమంతు నాయక్, దసరత్ నాయక్, గోపి నాయక్, మోహన్ నాయక్, లక్పతి నాయక్, దేవా నాయక్, రెడ్యా నాయక్, యూత్ అధ్యక్షుడు దినేష్ నాయక్, సచిన్, శివ,లక్ష్మణ్, సాయి, శంకర్ తదితరులు పాల్గొన్నారు

# బిజినెస్

## లాభాల్లోకి బీఎస్ఎన్ఎల్

ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ ఎట్టకేలకు లాభాల్లోకి వచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.262 కోట్ల లాభాన్ని ఆర్జించింది. 17 ఏండ్ల తర్వాత తొలిసారిగా సంస్థ లాభాలను ఆర్జించడం విశేషమని కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్యా సింధియా తెలిపారు. వ్యాపారాన్ని మరింత విస్తరించడంతోపాటు చందాదారులను పెంచుకోవడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. జూన్ త్రైమాసికంలో 8.4 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లు ఉండగా, అదే డిసెంబర్ చివరినాటికి ఈ సంఖ్య 9 కోట్లకు పెరిగినట్లు వెల్లడించారు. మొబిలిటీ సేవలు అందించడంతో వచ్చిన ఆదాయంలో 15 శాతం వృద్ధి నమోదుకాగా, అలాగే ఫైబర్-టూ-ది-హోమ్(ఎఫ్‌టీటీహెచ్) ఆదాయంలో 18 శాతం పెరుగుదల కనిపించింది. మరోవైపు, ఆర్థిక చెల్లింపులు, నిర్వహణ ఖర్చులు రూ.1,800 కోట్లకు తగ్గించుకోగలిగింది. 4జీ సర్వీసులను విస్తరించడానికి దేశవ్యాప్తంగా లక్ష టవర్లను ఏర్పాటు చేయడంలో భాగంగా ఇప్పటి వరకు 75 వేల టవర్లను ఇన్‌స్టాల్ చేసినట్లు, వీటిలో 60 వేల టవర్లు అందుబాటులోకి వచ్చాయని మంత్రి చెప్పారు. ఈ ఏడాది జూన్ నాటికి లక్ష టవర్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నదన్నారు.

# కొత్త టియాగో లుక్ అదరహో..

## 2025 మోడల్ ఈవీ విడుదల



కొత్త టియాగో ఈవీ డిజైన్ లో పెద్దగా మార్పు రాలేదు. కొలతలు, వీల్ బేస్, బూట్ స్పేస్ అలాగే ఉన్నాయి. 3,769 ఎంఎం పొడవు, 1,677 వెడల్పు, 1,536 ఎంఎ ఎత్తు, 2400 ఎంఎం వీల్ బేస్, 240 లీటర్ల బూట్ స్పేస్ అలాగే కొనసాగాయి. బయట మార్పులకు సంబంధించి కొత్త మోడల్ ఎల్ఈడీ హెడ్ లైట్లు, ముందు బంపర్ కోసం గ్రిల్ పునర్నిర్మించారు. పాత మోడల్ లో క్లోజ్ ఆఫ్ గ్రిల్ పై ఉన్న ఈవీ బ్యాడ్జీని ఇప్పుడు ముందు డోర్లకు ఇరువైపులా ఏర్పాటు చేశారు. పాత, కొత్త మోడళ్ల సైడ్ ప్రొఫైల్ లేఅవుట్ దాదాపు ఒకేలా ఉన్నప్పటికీ, కొత్త మోడల్ లో జీపీఎస్ తో కూడిన షార్క్ ఫిన్, 14 అంగుళాల వీల్ కవర్లు అదనంగా కనిపిస్తున్నాయి. వెనుక వైపు భాగం పాత కారు మాదిరిగానే ఉంది. టియాగో ఈవీ లేటెస్ట్ మోడల్ కొత్త రంగుల్లో అందుబాటులోకి వచ్చింది. చిల్ లైమ్, అరిజోనా బ్లూ, సూపర్ నోవా కాపర్ షేడ్స్ తో తీసుకువచ్చారు. అలాగే ప్రిస్టైన్ వైట్, డేటోనా గ్రే, టీల్ బ్లూలను పాత మోడల్ నుంచి తీసుకున్నారు.

**ఇంటీరియర్**

కొత్త మోడల్ లోపలి భాగంలోని ఇంటిరియల్ లో మార్పులు చేశారు. టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్ మెంట్ సిస్టమ్ ఆకట్టుకుంటోంది. సీట్ కవర్లు కొత్త రంగులో ఆకర్షణీయంగా ఉన్నాయి.

**ఫీచర్లు**

టియాగో 2025 మోడల్ లో కొత్త ఎల్ఈడీ హెడ్ లైట్లు, 10.25 అంగుళాల సమాచార వ్యవస్థ, వైర్ లెస్ ఆపిల్ కార్ ప్లే, ఆడ్రాయిట్ ఆటో, 45 డబ్ల్యూ యూఎస్ బీ - సీ చార్జింగ్ పోర్టు ఉన్నాయి. భద్రతా పరంగా పార్కింగ్ సెన్సార్లు, హిల్ హూల్డ్ కంట్రోల్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్ (ఈఎస్పీ) కలిగిన హెచ్ డీ రియల్ వ్యూ కెమెరా అమర్చారు.

# మహిళలకు షాకిస్తున్న పసిడి ధరలు.. తగ్గేదిలే అంటున్న వెండి



చరిత్రలోనే తొలిసారిగా రూ.88 వేలకు చేరువలో బంగారం ధర పరుగులు పెడుతోంది. తులం బంగారం ధర ఏకంగా లక్ష రూపాయల వరకు చేరుకునే అవకాశం ఉందని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇటీవల కాలం నుంచి బంగారం ధరలు ప్రతిరోజు సరికొత్త రికార్డు స్థాయిలో నమోదు అవుతున్నాయి. గడచిన రెండు నెలలు బంగారం ధరలు వరుసగా పెరుగుతూనే ఉన్నాయి. త్వరలోనే బంగారం ధర ఒక లక్ష రూపాయలు దాకేందుకు సిద్ధమవుతోంది. తాజాగా ఫిబ్రవరి 15న దేశంలో బంగారం ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.

-చెన్నైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.79,910 ఉండగా, అదే 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.87,170 ఉంది.

-ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.80,060 ఉండగా, అదే 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.87,320 ఉంది.

-ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.79,910 ఉండగా, అదే 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.87,170 ఉంది.

-బెంగళూరులో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.79,910 ఉండగా, అదే 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.87,170 ఉంది.

-హైదరాబాద్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.79,910 ఉండగా, అదే 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.87,170 ఉంది.

-విజయవాడలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.79,910 ఉండగా, అదే 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.87,170 ఉంది.

-కోల్‌కతాలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.79,910 ఉండగా, అదే 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.87,170 ఉంది.

# స్పోర్ట్స్

# భారత క్రికెటర్లతో ఫ్రెండ్లీగా ఉండొద్దు

**పాక్ మాజీ వికెట్ కీపర్ మొయిన్ ఖాన్**



భారత క్రికెటర్లతో ఫ్రెండ్లీగా ఉండవద్దని తమ క్రికెటర్లకు పాకిస్థాన్ దేశ మాజీ ప్లేయర్ చెబుతున్నాడు. ప్లేయర్ల పట్ల గౌరవం ఉంటే మంచిదే అని, అది ఫీల్డులో చూపించాల్సిన అవసరం లేదని పాక్ మాజీ వికెట్ కీపర్ మొయిన్ ఖాన్ అభిప్రాయ పడ్డాడు. భారత్ తో మ్యాచ్ లో ఎలా వ్యవహరించాలో మొయిన్ ఖాన్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో తెలిపాడు. మైదానంలో భారత ఆటగాళ్లతో అంత కలివిడిగా ఉండాల్సిన అవసరం లేదని, అలా ఉంటే అది బలహీనతగా ప్రొజెక్టు అవుతుందని పేర్కొన్నాడు. భారత జట్టుతో తాము ఎన్నో మ్యాచ్ లను ఆడామని, ద్వైపాక్షిక సిరీస్ లు కూడా ఆడిన మైదానంలో ఫ్రెండ్లీగా ఎప్పుడు లేమని మొయిన్ ఖాన్ గుర్తు చేశాడు. తమ జనరేషన్లో చాలా దిగ్గజాలు భారత జట్టులో ఉండేవారని, వారితో ఆడినప్పుడు కేవలం ప్రత్యర్థులుగానే ట్రీట్ చేసేవాళ్లమని తెలిపాడు. అయితే ఇప్పుడు జరుగుతున్న భారత్, పాక్ మ్యాచ్ ల్లో ఫ్రెండ్లీనెస్ ఓవర్ అయిందని విమర్శించాడు. భారత ఆటగాళ్లు క్రీజులోకి రాగానే, వాళ్ల బ్యాట్లను తడిమి చూడటం, స్నేహపూర్వకంగా ఉండటం సరికాదని వ్యాఖ్యానించాడు. ఇలాంటి చేష్టలను వీక్ నెస్ గా ప్రత్యర్థి టీమ్ లు భావించే అవకాశముందని, అంతిమంగా జట్టు ప్రదర్శనపై ప్రభావం చూపించే అవకాశముందని అభిప్రాయపడ్డాడు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ తమ దేశంలో ఆడకుండా దుబాయ్ లో ఆడుతున్న ఇండియన్ క్రికెట్ టీమ్ పై పాకిస్థాన్ లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. 1996 తర్వాత పాక్ నిర్వహిస్తున్న ఐసీసీ టోర్నీ ఇదే కావడం విశేషం. అయితే ఈ టోర్నీలో టాప్ -8 టీమ్స్ పాల్గొంటుండగా, భారత్ తప్ప మిగతా అన్ని జట్లు పాక్ లో మ్యాచ్ లు ఆడుతున్నాయి. ఐసీసీ చొరవతో హైబ్రిడ్ మోడల్లో టోర్నీలో ఆడేందుకు భారత్ ఒప్పుకుంది. దీని ప్రకారం లీగ్ మ్యాచ్ లతోపాటు నాకౌట్ మ్యాచ్ లు (ఒకవేళ చేరితే) దుబాయ్ లోనే భారత్ ఆడనుంది. తమ దేశంలో భారత్-పాక్ మ్యాచ్ ను చూద్దామని ఆశించిన పాక్ అభిమానులకు తాజా పరిణామం మింగుడు పడటం లేదు. సోషల్ మీడియా వేదికగా పలు డిమాండ్లు లేవనెత్తుతున్నారు. టోర్నీ ముగిసేవరకు భారత్ తో దూరంగా ఉండాలని, ఆటగాళ్లతో సఖ్యతగా మెలగవద్దని సూచిస్తున్నారు. ముఖ్యంగా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అండ్ కో తో ముచ్చట్లు, హగ్గులు పెట్టుకోవద్దని డిమాండ్ చేస్తున్నారు. తాజాగా మీడియాతో ఓ పాక్ ఫ్యాన్ మాట్లాడిన వీడియో వైరలైంది. ఈనెల 19న న్యూజిలాండ్-పాక్ జట్ల మధ్య పోరుతో మెగాటోర్నీ అధికారికంగా ప్రారంభమవుతుంది. 23న చిరకాల ప్రత్యర్థుల మధ్య పోరు జరుగుతుంది.

# విన్నింగ్ కెప్టెన్స్ లిస్ట్ లో హిట్ మ్యాన్ చేరతాడా?

**-కప్పు గెలిస్తే భారత్ ఖాతాలో మూడో టైటిల్**



గుతున్న టోర్నీ గెలవడానికి 8 టీమ్‌లు పోటీ పడుతున్నాయి. ఇప్పటి వరకు 8 ఛాంపియన్స్ ట్రోఫీలు ముగిశాయి. అందులో భారత్ రెండు గెలిచింది. ఈ సారి రోహిత్ శర్మ నేతృత్వంలో కప్పు గెలిస్తే భారత్ ఖాతాలో మూడో టైటిల్ చేరుతుంది. 1998లో మొదటి ఛాంపియన్స్ ట్రోఫీని ఐసీసీ నాకౌట్‌గా పిలిచారు. ఇది బంగ్లాదేశ్‌లో జరిగింది. హాన్సీ క్రోంజే నేతృత్వంలోని దక్షిణాఫ్రికా టైటిల్ గెలిచింది. ఫైనల్లో వెస్టిండీస్‌ను ఓడించింది. 2000లో కెన్యాలో జరిగిన ఫైనల్‌లో భారత్‌ను ఓడించి న్యూజిలాండ్ తొలి ఐసీసీ టోర్నమెంట్‌ను గెలుచుకుంది. అప్పుడు కివీస్ టీమ్ కెప్టెన్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్ వ్యవహరించాడు. 2002 ఛాంపియన్స్ ట్రోఫీ ఎడిషన్ శ్రీలంకలో జరిగింది. స్పష్టమైన విజేత తేలకుండా ముగిసింది. ఎందుకంటే భారత్, శ్రీలంక మధ్య జరిగిన ఫైనల్ వర్షం కారణంగా రెండు సార్లు వాష్ అవుట్ అయింది. దీంతో రెండు జట్లు ట్రోఫీని పంచుకున్నాయి. భారత్ కెప్టెన్‌గా సౌరవ్ గంగూలీ, శ్రీలంక కెప్టెన్‌గా సనత్ జయసూర్య ఉన్నారు. 2004 ఛాంపియన్స్ టోర్నమెంట్‌కు ఇంగ్లాండ్ ఆతిథ్యం ఇచ్చింది. బ్రియాన్ లారా కెప్టెన్సీలో వెస్టిండీస్ ఫైనల్‌లో ఇంగ్లండ్‌ను ఓడించి టైటిల్ గెలుచుకుంది. 2006లో రికీ పాంటింగ్ నాయకత్వంలో ఆస్ట్రేలియా ట్రోఫీ దక్కించుకుంది. ఫైనల్లో వెస్టిండీస్‌ను ఓడించింది. ఈ టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇచ్చింది. 2009లో వరుసగా రెండోసారి ఆస్ట్రేలియా రికీ పాంటింగ్ కెప్టెన్సీలో టైటిల్ నెగ్గింది. దక్షిణాఫ్రికాలో జరిగిన ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను ఓడించింది. 2013లో ఎంఎస్ ధోని నాయకత్వంలో భారత్ ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకుంది. బర్మింగ్‌హామ్‌లో జరిగిన ఫైనల్లో ఇంగ్లండ్‌ను భారత్ ఓడించింది.

# బ్రియాన్ బెన్నెట్ అద్భుతమైన సెంచరీ




హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో 21 ఏళ్ల యువ ఆటగాడు ప్రపంచం మొత్తాన్ని ఆశ్చర్యపోయేలా చేశాడు. అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి.. తన జట్టుకు మంచి విజయాన్ని అందించాడు. ఆ ఆటగాడు మరెవరో కాదు.. బ్రియాన్ బెన్నెట్. ఈ జింబాబ్వే యువ ఓపెనర్.. ఐర్లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో అద్భుత సెంచరీ సాధించాడు. బెన్నెట్ తన బ్యాట్‌తో ఏకంగా 169 పరుగులు చేశాడు. దీంతో నిర్ణీత 50 ఓవర్లలో జింబాబ్వే 299 పరుగులు చేసింది. 103 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో సిక్సర్లు, ఫోర్ల వర్షం కురిపించాడు బెన్నెట్. బెన్నెట్ తన ఇన్నింగ్స్‌లో 3 సిక్సర్లు, 20 ఫోర్లు బాదేశాడు. అంటే అతడు తన ఇన్నింగ్స్‌లో బౌండరీల రూపంలోనే 98 పరుగులు చేశాడు. బెన్నెట్ ఒక్కడే కాదు.. కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ కూడా అర్ధ సెంచరీ సాధించాడు. అతడు 61 బంతుల్లో 66 పరుగులు చేశాడు. జింబాబ్వే మిడిల్ ఆర్డర్ మాత్రం విఫలమైంది. సికందర్ రాజా 8 పరుగులు చేయగా, మాధవీరే కూడా 8 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అయితే ఎర్విన్, బెన్నెట్ కారణంగా జింబాబ్వే 299 పరుగుల గౌరవ ప్రదమైన స్కోర్ చేయగలిగింది. ఐర్లాండ్‌పై బ్రియాన్ బెన్నెట్ 169 పరుగులు చేసి అరుదైన రికార్డు సృష్టించాడు. ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ వన్డేలో 150 కంటే ఎక్కువ పరుగులు చేసిన అతి పిన్న వయస్కుడైన జింబాబ్వే ఆటగాడిగా నిలిచాడు. ఈ ప్రపంచ రికార్డు ఇంతకముందు పాల్ స్టిర్లింగ్ పేరిట ఉంది. ఈ ఐరిష్ ఆటగాడు కేవలం 20 సంవత్సరాల 4 రోజుల వయసులో 150 కంటే ఎక్కువ పరుగులు చేశాడు. దీంతో ఇప్పుడు ఆ రికార్డును బెన్నెట్ బద్దలు కొట్టాడు. జింబాబ్వే తరఫున వన్డే సెంచరీ చేసిన అతి పిన్న వయస్కుడిగా కూడా బ్రియాన్ బెన్నెట్ సాధించాడు. ఈ ఆటగాడు 21 సంవత్సరాల 96 రోజుల వయసులో సెంచరీ కొట్టాడు.

# ఓటీటీలో అకట్టుకున్న అమలాపాల్



అమలాపాల్ కీలక పాత్రలో వివేక్ దర్శకత్వం వహించిన మలయాళ చిత్రం 'ది టీచర్'. రెండేళ్ల కిందట థియేటర్లలో విడుదలై మిశ్రమ స్పందనకు పరిమితమైంది. ఇందులో అమలాపాల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా కనిపించింది. 2022 డిసెంబర్‌లో థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు మొదట మిశ్రమ స్పందన వచ్చినా తర్వాత పుంజుకుని హిట్ కేటగిరీలో చేరింది. ఇప్పుడు ఓటీటీలో దూసుకుపోతుంది. ఓటీటీ ప్రేక్షకులు ఈ సినిమా విపరీతంగా ఆదరిస్తున్నారు. ఓ టీచర్ తనకు అన్యాయం చేసిన నలుగురు స్టూడెంట్స్ పై ఎలా ప్రతీకారం తీర్చుకుంటుందన్న కథా ఆచఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు వివేక్. పక్కా మలయాళం మార్క్ రివేంజ్ థ్రిల్లర్ మూవీ నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. రెగ్యులర్ రివేంజ్ థ్రిల్లర్ సినిమాలకు భిన్నంగా ఈ చిత్రం ఉంటుంది. ఇందులో దేవిక అనే టీచర్ పాత్ర అమలాపాల్‌కు చక్కని ప్రశంసలు తీసుకొచ్చింది. ఊహకందని క్లైమాక్స్ సినిమాకే హైలెట్ అయ్యింది. థ్రిల్లర్, రివేంజ్ థ్రిల్లర్ జానర్ మూవీస్ ఇష్టపడే వారికి ఈ సినిమా ఎక్కువ నచ్చుతుంది. ఇందులో హకీమ్ షా, చెంబన్ వినోద్ జోష్, మంజు పిళ్లై కీలక పాత్రలు పోషించారు. దేవిక (అమలా పాల్) ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్. ఓ రోజు స్కూల్లో ఈవెంట్ తర్వాత ఆమె తిరిగి ఇంటికి వెళు ్ుండగా మరుసటి రోజు తన శరీరంపై ఉన్న గాయాలు చూసి షాకవుతుంది. అసలు ఆరోజు తనకు ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఓ స్టూడెంట్ ఇంటికి వెళ్లగా.. అక్కడ భయంకరమైన నిజం తెలుస్తుంది. తనకు జరిగిన అన్యాయంపై ఆమె ఎలా పోరాడింది? కట్టుకున్న భర్త వదిలేసినా అత్త ఇచ్చిన ధైర్యంతో జరిగిన అన్యాయంపై ఎలా ఫైట్ చేసింది. ఆ అన్యాయానికి పాల్పడిన నలుగురు స్టూడెంట్స్‌పై ఎలా ప్రతీకారం తీర్చుకుంటుంది అన్నది కథ.





# రూ.100 కోట్ల దిశగా నాగ చైతన్య 'తండేల్'

యువసామ్రాట్ అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం తండేల్. ఈ చిత్రానికి బ్లాక్ బస్టర్ డైరెక్టర్ చందూ మొండేటి దర్శకత్వం వహించారు. ఫిబ్రవరి 07 ఈ మూవీ భారీ అంచనాల మధ్య రిలీజ్ అయింది. ప్రస్తుతం పాజిటివ్ టాక్ తో దూసుకెళ్తోంది. విడుదలైన రెండు రోజుల్లోనే దాదాపు రూ.41కోట్లకు పైగా వసూలు చేసి రికార్డు నమోదు చేసిందీ మూవీ. అయితే తాజాగా 8 రోజుల్లోనే ఈ మూవీ రూ. 95.20 కోట్ల వసూళ్లు రాబట్టి బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ సొంతం చేసుకుంది. ఈ వీకెండ్ లోనే రూ. 100 కోట్లు కొల్లగొడుతుందని చిత్ర యూనిట్ అంచనా వేస్తోంది. దీంతో చైతూ రూ. 100కోట్ల క్లబ్ లోకి చేరనున్నట్లు సమాచారం అందుతోంది. ఇక ఈ సినిమాను గీత ఆర్ట్స్ బ్యానర్ పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించారు. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. ఇక ఈ మూవీలో డీ గ్లామర్ లుక్ లో చైతూ, సాయి పల్లవి కనిపించారు. చాలా సన్నివేశాల్ని ఎండలో, వానలో, సముద్రంలో 30 రోజులపాటు రాత్రింబవళ్లు కష్టపడి ఈ చిత్రం షూటింగ్ చేశారట. అందుకే సినిమాలో సముద్రం సన్నివేశాలు చాలా అద్భుతంగా వచ్చాయని ఇండస్ట్రీ వర్గాలతోపాటు సినిమా చూసిన ప్రేక్షకులు చెప్తున్నారు. నాగచైతన్య కెరీర్ లోనే అత్యధిక బడ్జెట్ తో ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు సమాచారం. దాదాపు రూ.90 కోట్లతో ఈ సినిమా రూపొందించినట్లు టాక్. అయితే ప్రస్తుతం పాజిటివ్ టాక్ తో సినిమా దూసుకెళ్తోంది. ఈ వారం వీకెంట్ పూర్తయ్యేనాటికి తండేల్ మూవీ రూ.100 కోట్ల క్లబ్ లోకి చేరుకుంటుందని సమాచారం.

# రష్మికపై కన్నడిల మండిపాటు

పుష్ప సినిమాతో నేషనల్ క్రష్ మార్క్ తెచ్చుకుంది కన్నడ బ్యూటీ రష్మిక మందన్న. 'పుష్ప-2'తో పాన్ ఇండియా క్రేజ్‌ను దాటుకుపోయింది. ఇప్పుడు సౌత్‌తోపాటు నార్త్‌లోనూ హవా కొనసాగిస్తోంది. శుక్రవారం విడుదలైన 'ఛావా'తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల ముంబయిలో జరిగిన ఓ ఈవెంట్‌లో ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఆ వ్యాఖ్యలకు కన్నడిగులు రష్మికపై మండిపడుతున్నారు. "నేను హైదరాబాద్ నుంచి వచ్చాను. ఇక్కడి ప్రేక్షకులు నాపై చూపిస్తోన్న ప్రేమాభిమానాలు చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది" అని ఆమె అనడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం కర్ణాటకలో దీనిపై చర్చ నడుస్తోంది.. ఆమె వ్యాఖ్యలను పలువురు కన్నడ వాసులు తప్పుపడుతున్నారు. ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నారు. 'విరాజ్‌పేట్ రష్మిక సొంతూరు. హైదరాబాద్‌కు ఎప్పుడు వచ్చింది? ఈ విషయం మాకు తెలియలేదు..!', 'వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు సొంతూరు గురించి చెప్పడానికి వచ్చిన సమస్య ఏమిటి?' అంటూ పలువురు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. గతంలో కన్నడిగులు ఆమెపై మండిపడ్డ సందర్భాలున్నాయి. కర్ణాటక, కొడగు జిల్లా విరాజ్‌పేటకు చెందిన రష్మిక 'కిరిక్ పార్టీ'తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు రష్మిక. 'ఛలో'తో టాలీవుడ్‌కి పరిచయమైయ్యారు. ఇక్కడ వరుస విజయాలు అందుకున్న ఆమె స్టార్ హీరోయిన్‌గా జాబితాలో చేరిపోయింది. ఇప్పుడు అగ్ర హీరోల సరసన నటిస్తోంది. అంతే కాదు హిందీ పరిశ్రమలోనూ అవకాశాలు అందుకుంటోంది.







# ప్రభాస్ 'స్పిరిట్' మూవీ ఆడిషన్‌కి అప్లయ్ చేసుకున్న మంచు విష్ణు

అగ్ర కథానాయకుడు ప్రభాస్, అర్జున్ రెడ్డి, యానిమల్ చిత్రాల దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న చిత్రం 'స్పిరిట్' . దాదాపు రూ. 300 కోట్ల బడ్జెట్‌తో రానున్న ఈ మూవీని టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి అప్‌డేట్స్ కోసం ప్రభాస్ అభిమానులంతా కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ చిత్రం ఈ ఏడాది సమ్మర్‌లో సెట్స్ మీదకి వెళ్లనున్నట్లు టాక్ నడుస్తుంది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీలో నటించేందుకు ఆసక్తి ఉన్నవారిని డిజిటల్ ఆడిషన్స్‌కి పిలిచింది సందీప్ రెడ్డి సొంత నిర్మాణ సంస్థ అయిన భద్రకాళీ పిక్చర్స్. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రభాస్ స్పిరిట్ సినిమాలో నటించే అవకాశం అన్ని వయసుల వారికి కల్పిస్తున్నామని ఇంట్రెస్ట్ ఉన్నవారు ఆడిషన్స్‌లో పాల్గొనవచ్చని తెలిపింది. అయితే ఆడిషన్స్‌లో పాల్గొనేవారు సినిమా లేదా థియేటర్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవారు అయి ఉండాలని తెలిపింది. అయితే ఈ ఆడిషన్‌కి దరఖాస్తు చేసుకున్నాడు టాలీవుడ్ నటుడు, మా అసోసియేషన్ ప్రెసిడెంట్ మంచు విష్ణు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. ప్రభాస్ 'స్పిరిట్' కాస్టింగ్ కాల్‌కి నేను కూడా అప్లయ్ చేశాను. ఏం జరుగుతుందో చూడాలి అని విష్ణు ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ వైరల్‌గా మారింది.

# చిరంజీవి ఇంట్రో సాంగ్.. 'విశ్వంభర' నుంచి మెగా అప్‌డేట్



టాలీవుడ్ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియన్ మూవీ విశ్వంభర. ఈ సినిమా కోసం మెగా అభిమానులతో పాటు మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే గత ఏడాది దసరా కానుకగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి కీలక అప్‌డేట్‌ను వెల్లడించారు మేకర్స్. విశ్వంభర సినిమాలో మెగాస్టార్ ఇంట్రడక్షన్ సాంగ్ చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా జరుగుతుంది. ఈ పాటకు శోభిమాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్నాడు. ఈ పాట గురించి చెప్పాలి అంటే మెగాస్టార్ తన స్వాగ్‌తో డాన్స్‌తో అలరించబోతుండగా.. ఎంఎం కీరవాణి అందించబోతున్న సంగీతం సినిమాకే హైలెట్‌గా నిలవబోతుంది. మెగా మాస్ బియాండ్ యూనివర్స్ కోసం సిద్ధంగా ఉండండి అంటూ చిత్రబృందం రాసుకోచ్చింది. సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా.. కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష కథానాయికగా నటిస్తుంది. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తున్నారు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492